క్లుప్తంగా

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుత్తి: మండలంలోని రజాపురం గ్రామంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో ఐదవ, ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఉషారాణి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. పది, నాలుగవ తరగతి చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ ,ఓసీ విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 24 లోపు దరఖాస్తు ఆన్‌లైన్‌లో చేసుకోవాలని, వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

22న పెద్దమ్మ రథోత్సవం


రథోత్సవానికి సిద్ధమైన రథం

పెద్దవడుగూరు : మండలంలోని అప్పేచర్ల గ్రామంలో ఈనెల 22న పెద్దమ్మతల్లి రథోత్సవం నిర్వహించనున్నారు. అమ్మవారిని గ్రామస్తులు ఇంటికి ఇలవేల్పుగా కొలుస్తారు. ఈ సంవత్సరం ఉగాదిని పురస్కరించుకుని అమ్మవారి రథోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఇందుకోసం కొత్తగా రథాన్ని తయారు చేయించారు. రథోత్సానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావాలని గ్రామస్తులు కోరారు.

స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ఆదివారం మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ, కమిషనర్ శరత్ చంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య నేతృత్వంలో శానిటేషన్ సిబ్బంది స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు మురుగుకాలువలు శుభ్రం చేశారు. చెత్తా చెదారాన్ని తొలగించారు. అపరిశుభ్రతను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు, శానిటరీ మేస్త్రీలు పాల్గొన్నారు. అలాగే శానిటేషన్ సిబ్బంది మురుగు, చెత్తా చెదారం, అపరిశుభ్రత ఉన్న ప్రాంతాలతో పాటు దోమల ఆవాసాలు ఉన్న ప్రాంతాల్లో ఫాగింగ్ చేపట్టారు. సీజనల్ వ్యాధులు 95 శాతం వరకు దోమల వల్లే వస్తాయని దోమల నిర్మూలనకు ఇక నుంచి రోజూ ఫాగింగ్ చేపడతామని మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య చెప్పారు.

శ్రీగీతాబోధ నాటకం గ్రంథాల విడుదల


గ్రంథాలను విడుదల చేస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: శ్రీపరంజ్యోతి నాటక కళా సమితి వ్యవస్థాపకుడు పరంధామయ్య సంకలనం చేసిన శ్రీగీతా బోధ నాటకం గ్రంథాలను తెలుగు అధ్యాపకుడు డాక్టర్ నాగశయన విడుదల చేశారు. ఆదివారం స్థానిక శారదా విద్యామందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాగశయన గ్రంథ సమీక్ష చేశారు. అనంతరం గ్రంథాలను నాటక కళాసమితి సభ్యులు, సాహితీ వేత్తలకు అందజేశారు. కార్యక్రమంలో బుశెట్టి వీరప్రతాప్. విశ్వనాథ్, శివదయాల్, చంద్రశేఖర్, తదితర సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన రామకృష్ణ

గుత్తి: కొత్తపేట బ్రిడ్జి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు..గొందిపల్లి గ్రామానికి చెందిన రామకృష్ణ పని మీద బైక్‌పై గుత్తికి వచ్చాడు. పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి బయలు దేరాడు. కొత్తపేట బ్రిడ్జి వద్ద బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొన్నాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని 108 వాహనంలో గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచనల మేరకు అనంతపురం తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సంతల ద్వారా రూ.3.72 లక్షల ఆదాయం

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన జీవాలు, పశువుల సంతల ద్వారా రికార్డు స్థాయిలో రూ.3.72 లక్షలకు పైగా ఫీజు వసూలైనట్లు యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ వై.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత నుంచి రూ.2,12,720 కాగా, ఆదివారం పశువుల సంత ద్వారా రూ.1,59,300 మేర ఆదాయం వచ్చినట్లు తెలిపారు. వచ్చే వారం మధ్యలో ఉగాది పండుగ ఉన్నందున జీవాల సంత ఆదాయం పెరిగిందన్నారు.

బాధిత రైతులందరినీ ఆదుకుంటాం


గోవిందరాయునిపేటలో పండ్లతోటలను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ ఏడీ రఘునాథరెడ్డి, హెచ్‌ఓ శైలజ, ఎంపీపీ, జెడ్పీటీసీ


చెదుల్లలో దెబ్బతిన్న మొక్క జొన్నపంటను పరిశీలిస్తున్న ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్, అధికారులు


మద్దలపల్లిలో పంటలు నష్టపోయిన రైతులతో మాట్లాడుతున్న నాయకులు, అధికారులు

శింగనమల: గాలివానకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ఉద్యాన, వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. శనివారం కురిసిన వడగండ్ల వానకు శింగనమల నియోజకవర్గంలో భారీగా ఉద్యాన పంటలు, వ్యవసాయ పంటలు దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఉద్యాన శాఖ, వ్యవసాయ శాఖ అధికారులతో అమరావతి నుంచి ఫోన్‌లో మాట్లాడారు. దీనితో ఆదివారం ఉద్యాన శాఖ ఏడీ రఘునాథరెడ్డి, హెచ్‌ఓ శైలజా వ్యవసాయ శాఖ ఏడీ నారాయణనాయక్, ఏఈఓ అక్కమ్మ, ఎంపీపీ యోగేశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు కంచిరెడ్డి సుధ, డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఆలూరు రమణారెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్వి నారాయణ దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అండగా ఉంటామని, నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం చేస్తామని భరోసా కల్పించారు. శింగనమల మండలంలో ఉద్యాన పంటలు 800 ఎకరాలు, ఇతర పంటలు 1,625 ఎకరాలు, పుట్లూరు మండలంలో ఉద్యాన పంటలు 2,891 ఎకరాలు, యల్లనూరు మండలంలో 260 ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. గ్రామాల్లోని ఆర్బీకే సిబ్బంది రైతుల వివరాలు సేకరిస్తున్నారని, నివేదికను ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు తెలిపారు.

బుక్కరాయసముద్రం: మండలంలో ఈదురుగాలులు, వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులందరినీ ఆదుకుంటామని ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్ పేర్కొన్నారు. ఆదివారం చెదుల్ల, నీలారెడ్డిపల్లి, నీలాంపల్లిలో ఈదురు గాలులు, వర్షాలకు దుబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి విపత్తుల ద్వారా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకునేందుకు ఎప్పుడూ ముందు ఉంటోందన్నారు. నష్టపోయిన రైతుల వివరాలను సేకరించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. మండలంలో 950 మంది రైతులకు సంబంధించి 1,650 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ ఏడీ వెంకటరాముడు తెలిపారు. 100 ఎకరాల్లో అరటి, 30 ఎకరాల్లో మామిడి 35 ఎకరాల్లో చీనీ, 15 ఎకరాల్లో మునగ, 5 ఎకరాల్లో నేరేడు పంటలు దెబ్బతిన్నాయన్నారు. వీటిపై నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపుతామన్నారు. ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి శైలజ, చెదుల్ల సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, మసూద్‌వలి, కొర్రపాడు ఉప సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బుల్లే నారాయణస్వామి, మల్లయ్య, నాగ, రుషింగప్ప తదితరులు పాల్గొన్నారు.

నార్పల: మండల వ్యాప్తంగా శనివారం కురిసిన వడగండ్ల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ నాయకులు రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ రఘునాథ్‌రెడ్డి, ఆలూరు రమణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వారు మద్దలపల్లి, వెంకటాంపల్లిలో వడగండ్ల వర్షంతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా పంటలు నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందేలా చూస్తామన్నారు. మండల వ్యాప్తంగా అరటి పంట 1,322 ఎకరాలు, మామిడి 260, చీనీ 200, కర్బూజ 23 , టమాట 12, మొక్కజొన్న 474, వేరుశనగ 125, వరి 20, ఉద్దులు 15 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు ఉద్యాన, వ్యవసాయాధికారులు తెలియజేశారు. ఎంపీపీ నాగేశ్వరరావు, అగ్రి బోర్డు మండల చైర్మన్ నాగలింగారెడ్డి, హెచ్‌ఓ ఫజులున్నిసా బేగం, ఏఓ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు: యల్లనూరు, పుట్లూరు మండలాల్లో శనివారం కురిసిన వడగండ్ల వానకు వందల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. యల్లనూరు మండలంలో 100 ఎకరాల్లో చీనీ, 65 ఎకరాల్లో అరటి, 355 ఎకరాల్లో మొక్కజొన్న పంటలల్లో నష్టం జరిగినట్లు ఉద్యాన అధికారిణి ఫజులున్నీసాబేగం, ఏఓ రామకృష్ణుడు తెలిపారు. బొప్పేపల్లిలో 30 మంది రైతులకు చెందిన అరటి పంట 65 ఎకరాల్లో , వేములపల్లి, నిట్టూరు, తిరుమలాపురం, మేడికుర్తి, బొప్పేపల్లి తదితర గ్రామాల్లో 250మంది రైతులకు సంబంధించి 350 ఎకరాల్లో మొక్కజొన్న పంట నేలవాలింది. పెద్దమల్లేపల్లి, బొప్పేపల్లి తదితర గ్రామాల్లో 40మంది రైతులకు సంబంధించి 60 ఎకరాలు, చిలమకూరులో 50 ఎకరాల్లో మామిడి పంట నష్టం జరిగింది. క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపి పంటనష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

గార్లదిన్నె: మండలంలో శనివారం రాత్రి కురిసిన వర్షంకు వివిధ పంటలకు నష్టం వాటిల్లింది. మండల వ్యాప్తంగా వరి వేరుశనగ, మొక్కజొన్న, పత్తి, పంటలు 89.5 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు ఏఓ సోమశేఖర్, హెచ్‌ఓ చందన ఆదివారం తెలిపారు.

యల్లనూరు(పుట్లూరు): పుట్లూరు మండలంలో ఎల్లుట్ల, కోమటికుంట్ల, వెంగన్నపల్లి, మడుగుపల్లి, మడ్డిపల్లి తదితర గ్రామాల్లో వేల ఎకరాల్లో అరటి, బొప్పాయి, చీనీ తదితర పంటలు నేల మట్టం అయ్యాయని రైతులు వాపోతున్నారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఆదివారం ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మెన్ వెంకట్రామిరెడ్డి, మడుగుపల్లి నాగేశ్వరరెడ్డి పరిశీలించారు. అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంపీపీ భరోసా ఇచ్చారు.

పంట నష్టపోయిన ప్రతి రైతుకూ న్యాయం

• ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి


ఫోన్‌లో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

శింగనమల: నియోజకవర్గం వ్యాప్తంగా శనివారం రాత్రి కురిసిన గాలివాన, వడగండ్లతో పంటలు నష్టపోయిన ప్రతి రైతుకూ న్యాయం చేస్తామని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. నియోజకవర్గంలో పంట నష్టంపై సమాచారం అందుకున్న ఎమ్మెల్యే ఉద్యానశాఖ,వ్యవసాయశాఖ అధికారులను క్షేత్రస్థాయికి వెళ్లి పంటలు పరిశీలించి, జరిగిన నష్టంపై అంచనా వేసి నివేదికలు పంపాలని ఆదివారం ఫోన్లో అధికారులను ఆదేశించారు. నియోజకవర్గవ్యాప్తంగా రైతులు సాగు చేసిన మామిడి, చీనీ, సపోటా, అరటి, వంటి ఉద్యాన పంటలతో పాటు వరి, మొక్కజొన్న, కూరగాయలు పంటలు అకాల వర్షానికి దెబ్బతినడం బాధాకరమన్నారు. నియోజకవర్గంలో పంట నష్టంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నష్ట పరిహారం అందించేలా కృషి చేస్తానన్నారు.

టీడీపీ కార్యకర్తలపై ఫిర్యాదు

గుత్తి: కొత్తపేట గ్రామంలో టీడీపీ కార్యకర్తలు రెచ్చగొట్టే చర్యలకు పూనుకున్నారు. ఎమ్మెల్సీ స్థానాలు గెలిచారనే అత్యుత్సాహంతో టీడీపీ కార్యకర్తలు లక్ష్మీనారాయణ, దస్తగిరి, బాషా, పాండు, రవి తదితరులు వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఇళ్ల వద్దకు వచ్చి శనివారం రాత్రి బాణాసంచా కాల్చారు. ఇక్కడ బాణా సంచ కాల్చవద్దని మీ ఇళ్ల వద్ద కాల్చాలని చెప్పినందుకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో ఘర్షణకు దిగారు. దాడికి ప్రయత్నించారు. ఈ విషయంపై వైఎస్సార్ సీపీ కార్యకర్తలు రాము, సుధాకర్, వెంకటరాముడు, సురేష్ తదితరులు ఆదివారం గుత్తి పోలీసు స్టేషన్‌కు వెళ్లి సీఐ వెంకటరామిరెడ్డికి ఫిర్యాదు చేశారు. తమను రెచ్చగొట్టడంతో పాటు దాడికి ప్రయత్నించి కవ్వింపు చర్యలకు పాల్పడిన టీడీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేయాలని కోరారు.

31లోపు ఆస్తి పన్ను వడ్డీ లేకుండా చెల్లించండి

గుంతకల్లుటౌన్: ఆస్తి, ఖాళీ జాగా పన్ను బకాయిలను వడ్డీ లేకుండా ఒకేసారి ఈ నెల 31వ తేదీలోగా చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ బండిశేషన్న ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈ ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న బకాయిలు, పన్నుపై విధించిన వడ్డీని వన్‌టైమ్ మెజర్ కింద మాఫీ చేశామని పేర్కొన్నారు. పన్ను చెల్లింపుదారులు ఈ బకాయిలను ఈ నెల 31వ తేదీలోగా చెల్లించినట్లయితేనే వడ్డీ మినహాయింపు వర్తిస్తుందని తెలియజేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ తదితర పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచేగాక జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శనం చేసుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

లాభాల బాటలో టౌన్ బ్యాంకు


మాట్లాడుతున్న టౌన్‌బ్యాంకు అధ్యక్షుడు అబ్దుల్ జిలాన్

గుత్తి: గుత్తి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు లాభాల బాటలో పయనిస్తోందని ఆ బ్యాంకు అధ్యక్షులు అబ్దుల్ జిలాన్, సీఈఓ మహేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని వసుధా ఫంక్షన్ హాల్లో ఆదివారం టౌన్ బ్యాంకు సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖాతాదారులు, ప్రజలు, బ్యాంకు అధికారులు, సిబ్బంది సమష్టి సహాయ సహకారాలతో బ్యాంకు లాభాల బాటలో ఉందన్నారు. ప్రస్తుతం బ్యాంకు రూ. 3.5 కోట్ల లాభాల్లో ఉందన్నారు. ఖాతాదారులకు మరిన్ని మెరుగైన, సత్వర సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. త్వరలోనే గుత్తిలో టౌన్‌బ్యాంకు కోసం నూతన భవనాన్ని నిర్మించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఖాతాదారులకు గిఫ్ట్‌లు పంపిణీ చేవారు. బ్యాంకు ఉపాధ్యక్షుడు కృష్ణ, డైరెక్టర్లు రాము, అంగడి నాగరాజు, స్టోర్ నాగరాజు, మధు, మాబు, వీరన్న, వెంకటేష్ (బాబు), మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలు పరిష్కరించాలి

పామిడి: సత్యసాయి వాటర్ ప్రాజెక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. పామిడిలో మూడురోజులుగా సమ్మెలో ఉన్న కార్మికులకు ఆదివారం సీపీఎం నాయకులు సంఘీభావం తెలిపారు. నాయకులు పీ అనిమిరెడ్డి, ముత్యాలు, నాగరాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత


నగదు అందిస్తున్న మిత్రులు

నార్పల: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నరసింహులు కుటుంబానికి అతడి మిత్రులు చేయూత నిచ్చారు. వివరాలు..దుగుమర్రి గ్రామంలో నివాసం ఉంటున్న నరసింహులు వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు నలుగురు పిల్లలు ఉన్నారు. నార్పల ఉన్నత పాఠశాలలో 2002-03లో నరసింహులు పదో తరగతి చదివాడు. దీంతో అతడి కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న మిత్రులు తమ వంతుగా రూ.50 వేలు నగదు అందజేశారు. భవిష్యత్తులో తమ మిత్రుని కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని వారు పేర్కొన్నారు.

చెస్ చాంపియన్‌షిప్ విజేతలు వీరే


విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడిపత్రి టౌన్: స్థానిక నందలపాడు సరస్వతి శిశు మందిరంలో ఆదివారం జిల్లా స్థాయి చెస్ అండర్-17 బాల, బాలికల చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. బాలుర విభాగంలో పట్టణానికి కృష్ణ సురేంద్ర ప్రథమ, చేతన్ రెడ్డి ద్వితీయ, బాలికల విభాగంలో శ్రీహ, నౌమిక తొలి రెండు స్థానాల్లో నిలిచారు. వీరు నలుగురు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.పోటీల్లో జిల్లా నుంచి 132 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పెద్దపప్పూరు: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2003- 2004 బ్యాచ్‌కు చెందిన పదో తరతగతి విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈసందర్భంగా వారు గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. అప్పట్లో తమకు చదువు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఒకరికొకరు ఎవరు ఎక్కడ ఏం చేస్తున్నారో తెలుసుకున్నారు.

22న లక్ష్మీచెన్నకేశవస్వామి రథోత్సవం


చెన్నకేశవస్వామి మూలవిరాట్

యాడికి: రాయలచెరువు గ్రామంలో ఉగాది పండుగ పురస్కరించుకుని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, గ్రామస్తుల సహకారంతో లక్ష్మి చెన్నకేశవ స్వామి రథోత్సవం నిర్వహించనున్నట్లు సర్పంచు తలారీ అరుణ, ఆలయ ధర్మకర్త శివ తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఆలయంలో ఉదయం నుంచి స్వామికి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. ఉదయం 10 గంటలకు స్వామి కల్యాణం, సాయంత్రం 4 గంటలకు రథోత్సవం ఉంటుందని తెలిపారు. 23 మధ్యాహ్నం 3 గంటల నుంచి రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో తొలి ఐదు స్థానాల్లో నిలిచిన వృషభాల యజమానులకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి రూ 80వేలు, సిద్దిగిరి శ్రీధర్ రెడ్డి రూ.50వేలు, బ్రహ్మానందరెడ్డి రూ.30 వేలు, ఉపేంద్రగౌడ్, లోకేష్ గౌడ్ రూ.20 వేలు, టీచర్ మనోహర్ రూ.10 వేలు నగదు బహుమతి అందిస్తారన్నారు. పోటీలో పాల్గొనే వారు 23న ఉదయం రూ.1000 ఎంట్రీ ఫీజు చెల్లించాలన్నారు. వివరాలకు 9705728208, 6303187313, నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

‘చలో డిల్లీ’ విజయవంతం చేయండి


జీపు జాతాలో మాట్లాడుతున్న నాయకులు

బుక్కరాయసముద్రం: కార్మిక, రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏప్రిల్ 5న తలపెట్టిన చలో డిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకుడు బాల రంగయ్య కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక, రైతాంగ సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందన్నారు. కార్మిక, రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 19 నుంచి 26 వరకు జిల్లా వ్యాప్తంగా జీపు జాతా కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు దేశ సంపద దోచి పెడుతోందన్నారు. కార్మిక హక్కులను, చట్టాలను కాలరాస్తోందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు రాయుడు, నరసింహారెడ్డి, ప్రజా నాట్యమండలి నాయకులు శ్రీనివాసులు, సీఐటీయూ మండల కార్యదర్శి నాగేంద్ర కుమార్, నాయకులు సంజీవరెడ్డి, పుల్లయ్య, నాగలింగమయ్య పాల్గొన్నారు.

తాడిపత్రి టౌన్ : ఏప్రిల్ 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని సీఐటీయూ, సీపీఎం, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు ప్రజలను కోరారు. కార్మిక , కర్షక సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చేపట్టిన జీపుజాతా ఆదివారం తాడిపత్రికి చేరింది. స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో నాయకులు కార్మిక, రైతుల సమస్యలపై కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ విధానాన్ని ప్రజలకు తెలియచేశారు. నాయకులు చంద్రశేఖర్, బాలరంగయ్య, నరసింహారెడ్డి, రాజారామిరెడ్డి, జగన్ మోహన్‌రెడ్డి, ఉమా గౌడ్, హనుమంతరెడ్డి, చంటి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక ‘ముసలమ్మ’

• రేపు ముసలమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవం


ముసలమ్మ తల్లి దేవాలయం


ముసలమ్మ మూల విరాట్

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని తాడిపత్రి రహదారి పక్కన చెరువు కట్ట సమీపంలో వెలసిన ముసలమ్మ కట్ట త్యాగానికి ప్రతీకగా నిలుస్తోంది. నిత్యం పూజలు అందుకుంటూ ప్రజల ఆరాధ్యదైవంగా విరాజిల్లుతోంది. పూర్వీకుల కథనం మేరకు..మండల కేంద్రంలో ఉన్న చెరువు సుమారు 300 ఏళ్ల క్రితం చెరువు నిండి ఉప్పొంగి ప్రవహించడంతో చెరువు కట్ట తెగిపోయింది. వర్షపు నీరు ఊరును ముంచెత్తుతుందని భయాందోళనకు గురయ్యారు. ఈక్రమంలో ప్రజలంతా గ్రామ సమీపంలో ఉన్న పోలేరమ్మను ప్రార్థించారు. చెరువు కట్ట సమీపంలో ఒక పెద్ద శబ్దంతో మాటలు వినిపించాయి. గ్రామంలో ఉన్న బసిరెడ్డి చిన్న కోడలు ముసలమ్మను చెరువుకట్టకు బలిస్తే ఈ తెగిన చెరువుకట్ట నిలుస్తుందని మాటల సారాంశం. ఈ విషయాన్ని గ్రామస్తులు బసిరెడ్డి కుటుంబం వద్దకు వెళ్లి తెలియజేశారు. ఈ విషయం విన్న ముసలమ్మ ప్రాణత్యాగానికి సిద్ధపడింది. అత్తమామల అనుమతి తీసుకుంది. దేవుని ప్రార్థించి ముసలమ్మ కట్ట సమీపంలో ఉన్న చెరువులోకి దూకింది. దీంతో వరదనీరు శాంతించి నిలిచిపోయింది. వెంటనే ప్రజలు ఆమెకు గుర్తుగా ముసలమ్మ కట్ట పేరుతో నిర్మాణం చేపట్టి నిత్యం పూజలు నిర్వహిస్తున్నారు.

ఘనంగా పూజలు..

చెరువు కట్ట సమీపంలో ఉన్న ముసలమ్మ ఆలయాన్ని మూడేళ్ల క్రితం ఆ వంశస్థులు అయిన సూర్యనారాయణరెడ్డి, సుశీలమ్మ కొత్తగా నిర్మించారు. దీంతో ఏటా ఆలయ వార్షికోత్సవం నిర్వహిస్తున్నారు. తృతీయ వార్షికోత్సవంలో భాగంగా 21న ఆలయంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు మూల దేవత ప్రార్థన, గురు ప్రార్థన, గణపతి పూజ, స్వస్తి వాచనము, రక్షా బంధనం నిర్వహించనున్నారు. 22న ఉదయం 6 గంటకు అమ్మవారికి అభిషేకం, కలశ స్థాపన, గణపతి హోమం, పంచామృతాభిషేకం, కలశ స్థాపన ఆదిత్యా నవగ్రహ హోమం, ముసలమ్మ అమ్మవారి మూల మంత్ర హోమం, ఉదయం 10 గంటలకు మహా పూర్ణాహుతి, మధ్యాహ్నం 12గంటలకు మహా మంగళ హారతి నిర్వహించనున్నారు.

22న చిక్కవడియార్ చెరువులో తెప్పోత్సవం

బీకేఎస్‌లోని చిక్కవడియార్ చెరువులో ఈనెల 22న సాయంత్రం 5 గంటలకు ముసలమ్మ దేవత తెప్పోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త సుశీలమ్మ తెలిపారు. ఏటా అమ్మవారితో కలసి చిక్కవడియార్ చెరువులో తెప్పోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. దేవాలయ ప్రాంగణంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

కార్తికేయుడికి పంచామృతాభిషేకాలు

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు, పంచామృతాభిషస్తకాలు నిర్వహించారు. ముందుగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయఆవరణలో రాహుకేతు హోమాలు చేశారు. భక్తులు ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేశారు. ఆలయంలో ఉన్న మంజునాథస్వామి, పార్వతిదేవికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు,అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.